# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 15, అక్టోబరు, 2014

నగర నడి బొడ్డున ఆకర్షణీయంగా కనిపించే హుస్సేన్‌సాగర్ హైదరాబాద్ నగర గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలి తప్ప, మురికి కూపంగా మారి అవమానకరంగా మారవద్దని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. హుస్సేన్‌సాగర్‌ను పరిశుభ్రం చేయాలని, దుర్వాసన రాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి బుధవారం హుస్సేన్‌సాగర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నక్లెస్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో హుస్సేన్‌సాగర్ నీరు కలుషితం అవుతున్న విషయాన్ని స్వయంగా పరిశీలించారు. హుస్సేన్‌సాగర్ వెదజల్లుతున్న దుర్గంధాన్ని స్వయంగా గమనించారు. బాల్కాపూర్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, కూకట్‌పల్లి, పికెట్ ప్రాంతాలనుండి వచ్చే మురుగునీరు నేరుగా హుస్సేన్‌సాగర్‌లోనే కలుస్తున్న తీరును చూసి ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రకాల వ్యర్థాలు కూడా హుస్సేన్‌సాగర్‌లో కలిసి నీరు కలుషితం అవుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం సచివాలయానికి వచ్చి జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, వాటర్ వర్క్స్ అండ్ సీవరేజెస్ బోర్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడం కోసం 1562 లో హుస్సేన్‌షాహి నిర్మించిన హుస్సేన్‌సాగర్ శతాబ్దాలుగా నగర ప్రజల దాహార్తి తీర్చిందన్నారు. కాని హుస్సేన్‌సాగర్‌ను రక్షించుకోవడంలో ఇప్పుడు విఫలం కావడం బాధాకరమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో హుస్సేన్‌సాగర్‌ను అందమైన, పరిశుభ్రమైన సరస్సుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. హుస్సేన్‌సాగర్‌కు చేరిన నీటిని శుభ్రం చేయడం కన్నా అసలు మురికి నీరు హుస్సేన్‌సాగర్‌లోకి రాకుండా అడ్డుకోవడం పైనే ఎక్కువ దృష్టి పెట్టాలని చెప్పారు. నాలాల నుండి వచ్చే మురుగు నీరు నేరుగా హుస్సేన్‌సాగర్ తూము నీరు పోయే చోటికి చేరేలా చుట్టూ డైవర్షన్ కెనాల్స్ నిర్మించాలని సూచించారు. ప్రస్తుతం ఇలాంటి ఒక మురికి కాలువ ఉన్నప్పటికి అది ఎక్కువ నీరును తరలించలేక పోతోందని ముఖ్యమంత్రి ఆకస్మిక తనిఖీ సందర్భంగా గుర్తించారు. మరింత పెద్ద కాలువలు హుస్సేన్‌సాగర్ చుట్టూ నిర్మించాలని చెప్పారు. ఒ వైపు మురుగునీరు వందల మిలియన్ల లీటర్ల మేర హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంటే నీటి శుద్ధి ప్లాంట్ల ద్వారా జరిగే కొద్దిపాటి శుద్ధి కార్యక్రమం ఫలితాలను ఇవ్వడం లేదని సిఎం అభిప్రాయపడ్డారు. వర్షా కాలంలో మంచినీటిని హుస్సేన్‌సాగర్‌లోకి పంపి తరువాత షట్టర్లు మూసివేయాలని చెప్పారు. వేలాది విగ్రహాలను గణేష్ ఉత్సవాల సందర్భంగా నిమజ్జనం చేయడం వల్ల ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనిక

రంగులు నీటిలో కలిసి హుస్సేన్‌సాగర్ కలుషితం అవుతోందని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఇందిరా పార్క్‌లో 15-20 ఎకరాల విస్తీర్ణంలో చిన్నపాటి సరస్సును నిర్మించాలనే ప్రతిపాదనను ముఖ్యమంత్రి చేశారు. అందులోనే గణేష్ నిమజ్జనం, దుర్గామాత విగ్రహాల నిమజ్జనం, బతుకమ్మల నిమజ్జనం జరపాలని చెప్పారు. ఆ సరస్సులో కూడా బోటింగ్ లాంటివి ఏర్పాటు చేసిన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే బహుళ ప్రయోజనాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తూ హుస్సేన్‌సాగర్ నీటితోనే ఈ సరస్సును నింపాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. హుస్సేన్‌సాగర్ పరిరక్షణ, విగ్రహాల నిమజ్జనం అంశాలకు సంబంధించి మరిన్ని సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తీసుకునేందుకు త్వరలోనే నగరంలోని ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రపంచంలోని చాలా నగరాల నడిబొడ్డులో కూడా హుస్సేన్‌సాగర్‌లాంటి సరస్సులు వున్నాయని, కాని అవి దుర్గంధం వెదజల్లడం లేదని సిఎం అన్నారు. నిజానికి హుస్సేన్‌సాగర్ కూడా నగరానికి గొప్ప ఆకర్షణ అని, విదేశాల నుండి వచ్చిన వారు కూడా హుస్సేన్‌సాగర్‌ను చూసి ఆనందిస్తున్నారన్నారు. కాని హుస్సేన్‌సాగర్ కలుషితం కావడం, దుర్గంధం వెదజల్లడం చూస్తే అవమానకరంగా ఉంటుందని అన్నారు. అందుకే తెలంగాణ వ్యాప్తంగా చెరువుల పునరుద్దరణ కార్యక్రమం తీసుకుంటున్నట్లే హైదరాబాద్ నగరంలో హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలన్నారు. నగరంలోని పౌరులందరిని భాగస్వాములను చేస్తూ హుస్సేన్‌సాగర్‌ను మంచి పరిశుభ్రమైన సరస్సుగా తీర్చిదిద్దాలన్నారు. హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ నిపుణుడిని తెప్పించి ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. హుస్సేన్‌సాగర్ పరిధిలోని భూభాగాన్నంతా కూడా పూర్తి స్థాయిలో రక్షించాలని, ఈ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

సమావేశంలో జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్‌కుమార్, హెచ్ఎండిఎ స్పెషల్ ఆఫీసర్ ప్రదీప్‌చంద్ర, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, హెచ్‌డబ్ల్యుడబ్ల్యుఎస్‌బి యండి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం